క్లుప్తంగా

వ్యాయామంతో ఆరోగ్యం


వ్యాయామం చేస్తున్న విద్యార్థులు

దుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఉన్న శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాయామంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయాకారి శెట్టి సునీత మాట్లాడుతూ వ్యాయామంతో ఆరోగ్యం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని సూచించారు. శిబిరంలో విద్యార్థులకు వ్యాయామ పోటీలు నిర్వహించామని, విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బోరు పనులకు భూమిపూజ

కూనవరం: వెంకటాయపాలెంలో తాగునీటి ఎద్దడి నివారణకు సర్పంచ్ సోందె ముత్తమ్మ ప్రత్యేక కృషి చేస్తున్నారు. జల్‌జీవన మిషన్ ద్వారా బోరువేసి, పైపులైన్ ఏర్పాటు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ రూ.1.50 లక్షలు జేజేఎం నిధులతో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. పైపులైను పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సోడె చంద్, మండల యూత్ కన్వీనర్ సోందె పాపారావు, సచివాలయం కన్వీనర్ మడకం పూర్ణ, వ్యవసాయ సలహాదారుడు దివాకర్, సుధాకర్, రాంబాబు, శ్రీను, లక్ష్మణరావు, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ జేఏసీ నూతన కమిటీ ఎన్నిక


ఆదివాసీ జేఏసీ నూతన కమిటీ సభ్యులు

ఎటపాక: మండలంలోని కృష్ణవరం గ్రామంలో ఆదివాసీ అనుబంధ సంఘాల సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఆదివాసీ జేఏసీ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. మండల జేఏసీ చైర్మన్‌గా కుంజా శ్రీను, వైస్ చైర్మన్లుగా వాసం రాము, కొలూరి కామేశ్వరావు, హరిబాబు, పాయం ప్రసాద్, డేవిడ్‌రాజు, ముద రాజు, నాగరాజు, చిన్నారావు, కోశాధికారులుగా నూపా అనిల్, కణితి రామకృష్ణ, అధికార ప్రతినిధులుగా సరియం రాజులు, తాటి సీతారాములు, ప్రచార కార్యదర్శిగా సున్నం శ్రీనులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏటీఏ మండల అధ్యక్షుడు కాక రాజు, మడివి నెహ్రూ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం


వేడుక జరుపుకొంటున్న కుటుంబసభ్యులు

రాజవొమ్మంగి: మండలంలోని మాతృదినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు తమ మాతృమూర్తులను ఘనంగా సత్కరించారు. తల్లిని మించిన దైవం లేదని కొనియాడుతూ నూతన వస్త్రాలు, పండ్లు సమర్పించి పూజించారు. కుటుంబసభ్యులంతా కలసి వేడుక ఘనంగా జరుపుకొన్నారు.

నేటి నుంచి 'గిరి బాల నేస్తం'

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఆసరా చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో గిరి బాల నేస్తం కార్యక్రమం నిర్వహించనున్నట్టు గిరిజన మహిళ సంఘం మండల కమిటీ సభ్యురాలు ఈశ్వరమ్మ తెలిపారు. సోమవారం నుంచి ఐదు రోజులు పాటు నిర్వహించే కార్యక్రమంలో పిల్లలకు డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, క్విజ్, పాటల పోటీలు, కవిత్వాలు వంటి అంశాల్లో చిన్నారులకు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

కొత్తపల్లి జలపాతం సందర్శన


జలపాతాన్ని సందర్శించిన డిప్యూటీ కలెక్టర్ శర్మ దంపతులు

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతాన్ని ఆదివారం డిప్యూటీ కలెక్టర్ శర్మ సతీమణితో కలిసి సందర్శించారు. ప్రకృతి అందాలను వారు తిలకించారు. ఈ ప్రాంత పర్యాటక సమాచార వివరాలను టూరిజం సూపర్‌వైజర్ వంతాల అభి ఆయనకు తెలిపారు.


అరకులోయలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


పవనగిరి క్షేత్రంలో సువర్చలా సమేత ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు


ముంచంగిపుట్టులో అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి


ముంచంగిపుట్టులో భక్తులతో కలిసి పూజలు చేస్తున్న జేసీ శివశ్రీనివాస్ కుటుంబసభ్యులు


జి.మాడుగులలో భక్తులతో కలిసి పూజలు చేస్తున్న జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి దంపతులు


పొల్లూరులో పూజలు చేస్తున్న భక్తులు

- ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు
- ఆలయాలకు తరలివచ్చిన భక్తులు

అరకులోయ రూరల్: జిల్లా వ్యాప్తంగా హనుమజ్జంతి వేడుకలను ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. తెల్లవారుజాము నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామాలన్నీ అంజనీపుత్రుని నామస్మరణతో మార్మోగాయి. పలు చోట్ల శోభయాత్ర సాగింది. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అరకు మండలంలోని అరకులోయ, పద్మాపురం, ములియగలుంగు, యండపల్లివలస గ్రామాల్లో కొలువైన ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హుకుంపేట: మండలంలోని సూకురు పంచాయతీ బిర్సింగి గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అఖిల భారత గిరిజన ఉద్యోగస్తుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయపల్లి సింహాచలం కుటుంబ సమేతంగా పాల్గొని భక్తులతో కలిసి పూజలు చేశారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని వీరాంజనేయ ఆలయంలో జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ కుటుంబసమేతంగా భక్తులతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జై దుర్గ వర్తక సంఘం ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం వీరాంజనేయ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని గెమ్మెలి, ఎం.నిట్టాపుట్టు, గడుతూరు, సొలభం, వనెల్బ, సంతబయలు, కె.కోడాపల్లి, జి.మాడుగుల తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గాంధీనగర్‌లోని పంచముఖ ఆంజనేయ ఆలయంలో శ్రీ హనుమ ఆశ్రమం ప్రతినిధి సాయిరాం స్వామీజీ , శ్రీ కృష్ణాపురం శ్రీపాకలపాటి గురుదేవుల ఆశ్రమం శ్రీ రామనంద స్వామిజీ అధ్వర్యంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయంలో మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, దంపతులు, గ్రామ పెద్దలు ఎం వరహాలరాజు, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.మత్స్యరాజు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గాంధీనగరం శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో థింసా నృత్యం, హరిభజన, కోలాటంతో శోభాయాత్ర జరిగింది.అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

చింతపల్లి: లోతుగెడ్డ కూడలిలోని ఆంజనేయస్వామి ఆలయంలో కమిటీ ప్రతినిధి నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటుచేశారు. మండల కేంద్రంలోనూ భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు జరిగాయి.

కొయ్యూరు: మండల కేంద్రంలోని హనుమజ్జయంతి వేడుకల్లో భాగంగా భక్తుడు అనిశెట్టి చిరంజీవి ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది.

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు జరిగాయి. క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాములతో పాటు శ్రీ సూర్య ఉషాచాయదేవిలకు అష్టోత్తర పూజ నిర్వహించారు.మంత్రపుష్పాలతో నీరాజనం సమర్పించారు. తీర్థప్రసాద వితరణ గావించారు.

రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి, ఎర్రంపాడు, రాజవొమ్మంగి, జడ్డంగి తదితర గ్రామాల్లో ఆదివారం హనుమజ్జయంతి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

మోతుగూడెం: మోతుగూడెం, పొల్లూరు గ్రామాల్లో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మోతుగూడెంలో సుమారు 2000 మందికి అన్న సమారాధన చేశారు.


పవనగిరి, లోతుగెడ్డలో ఆంజనేయస్వామి విగ్రహాల వద్ద పూజలు చేస్తున్న భక్తులు


ఎర్రంపాడు గ్రామంలో హోమం, పూజల్లో పాల్గొన్న భక్తులు

రేపటి నుంచి గంగాలమ్మ తల్లి ఉత్సవాలు


గంగాలమ్మ తల్లి

మారేడుమిల్లి: మారేడుమిల్లి గ్రామ దేవత మాతశ్రీ కనకవర్షిణి గంగాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు మంగళవారం ప్రారంభం కామన్నాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు భారీ స్థాయి లో ఏర్పాటు చేశారు. ఏటా మే నెలలో గంగాలమ్మ తల్లి ఉత్సవాలు నిర్వహించ డం ఆనవాయితీగా వస్తుంది. ఈ ఏడాది కూడా ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యుదీపాలంకరణతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. తొలి రోజు మంగళవారం ఉదయం 5.30 నిమిషాలకు ఉత్సవ కమిటీ చైర్మన్ లక్ష్మి శ్రీనివాసరెడ్డి, సింధు, ఉప సర్పంచ్ వీరబాబు, లక్ష్మి దంపతులచే పూజ కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం 8.30 నిమిషాలకు బోనాల ఊరేగింపు, అనంతరం పూజా కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం గరగరాలాట, కోలాటా నృత్యం ప్రదర్శన వంటి పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ చైర్మన్ లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి కోరారు.

200 మందికి వైద్య పరీక్షలు


శిబిరంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న స్వామిజీ

రంపచోడవరం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల, రాజమండ్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్టు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో మఠం ఆఫీస్ ఇన్‌చార్జి స్వామి వేద విద్యానందజీ మహరాజ్, స్వామి సేవ్యనందాజీ మహరాజ్ పాల్గొని సేవలను పరిశీలించారు. వైద్యులు డా.జి.భాస్కర్, తలారి వెంకట సుబ్బారావు, ఎస్.సంపత్ కుమార్ సుమారు 200 మందికి వైద్య సేవలందించారు. అవసరమైన 48 మందికి రక్తపరీక్షలు, నలుగురికి ఈసీజీలు, ఏడుగురికి థైరాయిడ్ పరీక్షలు, ఆరుగురికి ఎక్స్‌రేలు, పదకొండు మందికి ఫిజియోథెరపీ చేసినట్టు స్వామీజి తెలిపారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ చెప్పారు. శిబిరంలో క్యాంప్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, వలంటీర్ వీర్రాజు సిబ్బంది పాల్గొన్నారు, రోగులకు, సహాయకులకు భోజన సదుపాయం కల్పించినట్టు స్వామీజీ తెలిపారు.

చినుకు పడితే చిత్తడే


వర్షాలకు బురదమయంగా మారిన చెరుకుమడత-కంటిపురం రహదారి

అనంతగిరి: మండలంలోని పెదబిడ్డ పంచాయతీ పులుసుమామిడి జంక్షన్ నుంచి చెరుకుమడత కంటిపురం రహదారి అధ్వానంగా మారింది. వర్షాలకు రహదారి చిత్తడి మారడంతో ప్రయాణాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. కంటిపురం నుంచి పెదబిడ్డ మీదుగా గుమ్మవరకు తారురోడ్డు నిర్మాణం జరిగినప్పటికీ, చెరుకుమడ నుంచి కంటిపురం వరకు గత పదేళ్ల క్రితం నిర్మించిన రహదారి కోతకు గురైంది. దీంతో రహదారి నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం ట్రైబల్ వెల్ఫేర్ ద్వారా నిధులు మంజూరయ్యాయి. పనులు మధ్యలో నిలిచిపోవడంతో వర్షాలకు రోడ్డు బురదమయంగా మారి వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రహదారి మధ్యలో నిలిచిపోయిందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, రహదారి పూర్తి చేసే విధంగా కృషి చేయాలని వారు కోరుతున్నారు.

అ'పూర్వ' కలయిక


సమావేశమైన పూర్వ విద్యార్థులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-1లో 2003-2004 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఆదివారం జరిగింది. అల్లూరి, విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, హైదరాబాద్ తదితర జిల్లాల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 80 మంది పూర్వ విద్యార్థులు 20 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఒకరికొకరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో చదువుకున్న పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. రానున్న రోజుల్లో ప్రతి ఏడాది పాఠశాలలో అందరూ కలవాలని నిర్ణయం తీసుకున్నారు.

మన్యం పాలపిండికి గిరాకీ


గుమ్మసిరగంపుట్టులో ఇంటి ముందు ఎండ బెట్టిన పాలపిండి

ముంచంగిపుట్టు: ఆంధ్ర-ఒడిస్సా సరిహద్దు ప్రాంతలైన ముంచంగిపుట్టు, పెదబయలు, ఒడిశాలోని లంతాపుట్టు, మాచ్‌ఖండ్, ఒనకడిల్లీ, పాడువ ప్రాంతాల్లో మన్యం పాలపిండి(బత్తిరి పాలు)కి మంచి గిరాకీ నెలకొంది. వేసవి కాలం కావడంతో పాలగుండకు ధర అమాంతం పెరిగిపోయింది. ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో పసుపు మొక్కలు ఆకారంగానే ఉంటూ పసుపు పంట లాగానే పండిస్తారు. పాలపిండిని పూర్వీకుల నుంచి వినియోగిస్తున్నట్టు ఉన్నట్టు గిరిజనులు చెబుతారు. ఏడాది పోడవునా భూమిలో పసుపు పంట లాగా పండిస్తారు.

దుంప నుంచి పాలగుండ తయారీ

పాలగుండ మొక్క నుంచి దుంపను తీసి శుభ్రం చేసి గంటల కొద్ది జల్లేడపై రుద్ది దాని నుంచి వచ్చే పిప్పి రసాన్ని పాత్రలోకి సేకరిస్తారు. ఒక రాత్రంతా రసాన్ని ఊరబెడతారు. ఉదయాన్నే చాపల్లో, పాత్రల్లో ఈ రసాన్ని పోసి ఎండ బెడతారు. వారం రోజులు తర్వాతా కేకు ఆకారంలో గట్టిగా తయారవుతుంది. అనంతరం వీటిని ముక్కలుగా కోస్తారు. ఇలా ఎంతో కష్టబడి పాల పిండిని తయారు చేస్తారు. మార్కెట్‌లు, వారపు సంతల్లో పాలపిండి కిలో రూ.250 నుంచి రూ.280 వరకు అమ్మకాలు చేస్తారు. దీనిని మైదాన ప్రాంత వాసులు సరిహద్దుకు వచ్చి అధికంగా కొనుగోలు చేస్తూంటారు. మైదాన ప్రాంతంలో కిలో పాల పిండి రూ.400 పైగా ధర పలుకుతుంది. ఎటువంటి అనారోగ్య సమస్యలు కలిగించని పాలపిండి శరీరంలో రోగ నిరోధక శక్తి పెంచడంలో బాగా పనిచేస్తుందని గిరిజనులు చెబుతారు.

జూన్ 13న ఒమ్మలి మోదకొండమ్మ పండగ

మాడుగుల: ఒమ్మలిలో మోదకొండమ్మ పండగ జూన్ 13న నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ ఉగ్గిన వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నామన్నారు. అదే నెల 5న అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలు కొలువు ఏర్పాటు చేస్తామన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

గొలుగొండ: జోగుంపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1997-98 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన వీరంతా ఆదివారం ఇక్కడ ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశారు. 25 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో పరవశించిపోయారు. ఆనాటి జ్ఞాపకాలతోపాటు కష్టసుఖాలు ఒకరికొకరు పంచుకుని మురిసిపోయారు. అప్పటి గురువులకు ఘన సన్మానం చేశారు. హైస్కూల్ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నట్లు ప్రకటించారు.

రూఫ్‌గార్డెనింగ్‌పై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న జయచంద్ర

అనకాపల్లిటౌన్ : రూఫ్‌గార్డెన్‌తో ఇంటికి, శరీరానికి మేలు చేకూరుతుందని బయోటెక్నాలజీ శాస్త్రవేత్త కె.జయచంద్ర అన్నారు. పట్టణంలోని గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో గ్రీన్ క్లబ్, గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన రూఫ్ గార్డెనింగ్‌పై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉష్ణోగ్రత ప్రభావాలను తగ్గించడంలో రూఫ్‌గార్డెన్ సాగు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇలాంటివి నగరాల్లో నివాసాలకు చలువపందిళ్లు అని, పచ్చని ఆవాసం-ప్రకృతితో సావాసమని పేర్కొన్నారు. రూఫ్‌గార్డెనింగ్‌లో మెలకువలను వివరించారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణి భూషణ్‌శ్రీధర్, జిల్లాకు చెందిన రూఫ్‌గార్డెన్ సంఘ సభ్యులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కోలాటంపై విద్యార్థులకు శిక్షణ


దిమిలి గ్రంథాలయంలో విద్యార్థులు

రాంబిల్లి: దిమిలి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి మంచి స్పందన లభిస్తుందని లైబ్రేరియన్ ఎస్. శకుంతల తెలిపారు. ఆదివారం వేసవి శిబిరంలో కథలు చెప్పినట్లు తెలిపారు. అలాగే కోలాటంపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఖోఖో ఆటపై అవగాహన కల్పించి ఆడించడం జరిగిందన్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట


పీఎస్‌ఆర్ పేటలో ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్న భక్తులు

యలమంచిలి : మండలంలో ములకలాపల్లి గ్రామంలో ఆదివారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ బోదెపు గోవింద్ అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకోని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. హనుమాన్ జయంతి సందర్భంగా గ్రామంలో అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు.

కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, గ్రామ సర్పంచ్ దుబాయ్ అప్పలనాయుడు పాల్గొన్నారు. మండలంలో పీఎస్‌ఆర్ పేట, పేటబయ్యవరం గ్రామాల్లో అభయాంజనేయ స్వామి వారి జయంతి మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అభయాంజనేయస్వామి వారి దర్శనానికి భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. అభయాంజనేయ స్వామి వారిని ఎంపీపీ దర్శించుకున్నారు. గ్రామంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు గొన్నాబత్తుల శివలక్ష్మి శివ, బయ్యవరం మాజీ సర్పంచ్ మొగ్గ గోవిందరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నమామి సాయి శత రుద్రీయం

కె.కోటపాడు: కింతాడ శివారు కూండ్రపువానిపాలెంలోని రామసత్యసాయ మందిరంలో ఆదివారం నమామి సాయి శత రుద్రీయం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో శోభాయాత్ర, గోమాత పూజ, ప్రశాంతి పతాకావిష్కరణ, జ్యోతి ప్రకాసనం కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల వేద అధ్యయన విభాగం సమన్వయకర్త సాయి శ్రీహరిప్రసాదశర్మ, జిల్లా అధ్యక్షుడు కృష్ణంరాజు, అప్పలనాయుడు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



దళారులతో గిరిజనులకు తప్పని ఇక్కట్లు


లోతట్టు ప్రాంతం నుంచి అటవీ మార్గం మీదుగా కొండచీపుళ్లను మోసుకొస్తున్న గిరిజనులు

వై.రామవరం: అటవీ ఉత్పత్తులను సేకరించే గిరిజనులను దళారీలు అతి దారుణంగా దోచుకుంటు న్నారు. ఈ సీజన్‌లో మండలంలోని లోతట్టు ప్రాంత గిరిజనులు కొండ చీపుళ్లను సేకరిస్తారు. కొండవాగుల సమీపంలో ఈ కొండచీపుళ్ల మొక్కలు ప్రతీ ఏటా మొలుస్తాయి. ఇవి పండిన తరువాత దాని ఎన్నును కోస్తారు. ఆ ఎన్నులన్నింటిని చీపుళ్లగా తయారు చేస్తారు. ఏట మార్చి నెల నుంచి కొండ చీపుళ్ల మొక్కలు పండుతాయి. లోతట్టు ప్రాంత గిరిజనులు మార్చి, ఏప్రిల్ నెలల్లో పంటను సేకరించి, చీపుర్లుగా తయారు చేసి, వారపు సంతలకు తీసుకొచ్చి అమ్ముకుంటారు. వై.రామవరం మండల పరిధిలోని గ్రామ గిరిజనులు సుమారు లక్షకుపైగా చీపుర్లు సేకరిస్తారు. అయితే దళారుల గిరిజనుల వద్దకు వెళ్లి కొండ చీపుళ్లను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో చీపురు కట్ట రూ.25 నుంచి రూ.30 కొనుగోలు చేసి, మండల కేంద్రమైన వై.రామవరం తదితర ప్రాంతాలకు తీసుకొచ్చి రూ.100కు పైగా ధరకు విక్రయిస్తున్నారు. ఇలా దళారీల చేతులో అటవీ ఉత్పత్తులు సేకరించే గిరిజనులు మోసపోతున్నారు. గతంలో జీసీసీ ద్వారా కొండచీపుళ్లను సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి కొనుగోలు చేసేవారు. చీపురు ఒక్కంటికి రూ.50 నుంచి రూ.60 వరకు గిట్టుబాటు ధర కల్పించేవారు. అయితే ఈ ఏడాది ఇంతవరకు కొనుగోలు ప్రారంభించలేదని గిరిజనులు చెబుతున్నారు. తక్షణమే కొనుగోలు ప్రారంభించి, దళారీలకు అడ్డుకట్ట వేయాలని లోతట్టు ప్రాంత గిరిజనులు కోరుతున్నారు. ఈ విషయాన్ని అడ్డతీగల జీసీసీ బ్రాంచి మేనేజరు జి.చంద్రశేఖరు వద్ద ప్రస్తావించగా గిట్టుబాటు ధర నిర్ణయం కాగానే కొనుగోలు ప్రారంభిస్తామన్నారు. ప్రతీ ఏటా వై.రామవరం మండలంలో సుమారు 70 వేల కొండ చీపుర్లు కొనుగోలు చేసే వారమన్నారు. ఈ ఏడాది కూడా త్వరలో తమ సిబ్బందితో కొనుగోలు ప్రారంభించి, దళారీల బారి నుంచి గిరిజనులను కాపాడతామని స్పష్టం చేశారు.

ఘనంగా దుర్గాలమ్మ పండగ

రాంబిల్లి: కుమ్మరాపల్లి గ్రామంలో దుర్గాలమ్మ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేల వేషాలు, కోలాటాలు, తప్పెటగుళ్లు వంటి కార్యక్రమాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.